చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: ఒడిశా నృత్యాలు, పాటలతో కళాకారులు సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో స్వాభిమాని ఒడియా పరివార్ హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో ఆ రాష్ట్రానికి చెందిన చేనేత హస్తకళా, ఫుడ్, సాంస్కృతిక కార్యక్రమాల ఉత్సవాన్ని శుక్రవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లో నివసిస్తున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంబల్పూరి స్టాల్, కోటపాడ్, మణిబంధ్, సంతాలీ, పిపిలీ ఆప్లిక్‌వర్క్, డోక్రా ఆర్ట్, ఐరన్‌ఆర్ట్, లాక్‌గాజులు తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. ఒడిసీ సాంప్రదాయ వంటకాలు నోరూరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో జెజెఎల్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, మాజీ డీజీపీ డాక్టర్ సునీల్ కుమార్ స్త్రైన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిశోధనలు, విద్య ఆవశ్యకతను గుర్తించాలి

'ఐఎస్‌బీ' డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల

రాయదుర్గం: నేడు ఆరోగ్య రంగంలో పరిశోధనలు, విద్య ఎంతో ప్రాముఖ్యత కలిగిన అంశాలుగా మారాయని, వీటి ఆవశ్యకతను గుర్తించాలని ఇండియన్ స్కూల్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ (ఐఎస్‌బీ-ఎంఐహెచ్‌ఎం) ఆధ్వర్యంలో 'ఐఎస్‌బీ హెల్త్‌కేర్ 4.0 సమ్మిట్ రెండవ ఎడిషన్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ భారతదేశం వంటి దేశాలకు సామాజిక అభివృద్ధిలో ఆరోగ్య సంరక్షణ కీలకమైన అంశం అని అన్నారు. ఐఎస్‌బీ మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ అనేది ఇంటర్ డిసిప్లినరీ రీసెర్చ్ సెంటర్‌గా గుర్తింపు పొందిందన్నారు. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) సభ్యుడు బిసి పట్నాయక్ మాట్లాడుతూ దేశంలో 41వేల కంటే ఎక్కువ ఆస్పత్రులు ఉన్నాయని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా నగదు రహిత ఆరోగ్య బీమా అవసరమన్నారు. అందరికీ బీమా కలను నెరవేర్చాలంటే చాలా దూరం వెళ్లాలన్నారు. ఐఎస్‌బీ డిప్యూటీ డీన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సారంగ్ డియో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలను కలుపుకొని ఆరోగ్య సంరక్షణలో నిర్వహణ సూత్రాలను ఏకీకృతం చేయడం అవసరమన్నారు. ప్రముఖ ఆరోగ్య నిపుణుడు డాక్టర్ నచికేత్ మోర్ ప్రసంగించారు.



మాట్లాడుతున్న డీన్ ప్రొ.మదన్ పిల్లుట్ల

క్రీడారంగంలో లింగ భేదం ఉండకూడదు

● అర్జున అవార్డు గ్రహీత ద్యూతీచంద్



రాయదుర్గం: వ్యవస్థలన్నింటినీ సులభతరం చేయడానికి అందరినీ కలుపుకొనిపోవాలని అర్జున అవార్డు గ్రహీత ద్యూతీచంద్ అన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో క్వీర్ స్పేసెస్ ఇన్ స్పోర్ట్స్‌పై అబ్జర్వేషన్ అండ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫ్ స్పోర్ట్స్' అనే అంశంపై ఆమె శుక్రవారం కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ద్యూతీచంద్ మాట్లాడుతూ ఇబ్బందులు పడే స్థాయి నుంచి వచ్చిన క్రీడాకారుల కష్టాలను గుర్తించి వారిని ప్రత్యేకంగా ప్రోత్సహించాలని సూచించారు. క్రీడారంగంలో లింగ భేదాలకు అవకాశం లేకుండా అందరికీ సమాన న్యాయం చేసేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత రమేష్ నాగపురి, ప్రొఫెసర్ హసంగ్ మర్చంట్, ట్రాన్స్‌జెండర్ రెఫరి అనామికాలియో, డాక్టర్ భాస్కర్ లామా, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

పట్టణీకరణ పేరుతో చెరువుల కబ్జా



నల్లగండ్ల చెరువును పరిశీలిస్తున్న నర్సింహ, కమిటీ సభ్యులు

శేరిలింగంపల్లి: పట్టణీకరణ, పారిశ్రామీకరణ పేరుతో నగరంలో చెరువులు, కుంటలు కబ్జాల పాలవుతున్నాయని రంగారెడ్డిజిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య జిల్లా చీఫ్ ప్రమోటర్ గోరెంకల నర్సింహ పేర్కొన్నారు. కమిటీ సభ్యులతో శుక్రవారం నల్లగండ్ల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా నల్లగండ్ల చెరువు కబ్జా చేస్తున్న అపర్ణా నిర్మాణ యాజమాన్యంపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. కొంత మంది స్థానిక రాజకీయనాయకులు కలిసి చేరువులో మట్టిపోసి వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువుపై 100 మంది మత్స్యకార కుటుంబాలు ఆధారపడ్డాయని పేర్కొన్నారు. శాటిలైట్ ద్వారా డిజిటల్ రీసర్వే చేసి ఎఫ్‌టిఎల్ హద్దురాళ్ళు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మత్స్యకారులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార అడహక్ కమిటీ సభ్యులు వెంకటేష్, కృష్ణ, సురేందర్‌కుమార్, లక్ష్మణ్, సతీష్, గోపాల్ పాల్గొన్నారు.

మియాపూర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా దుర్గారామలింగప్రసాద్

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా వి.దుర్గారామలింగప్రసాద్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంతకు ముందు ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన ప్రేమ్‌కుమార్ సస్పెండ్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో శుక్రవారం ఎస్‌హెచ్‌ఓగా రామలింగప్రసాద్ వచ్చారు.

'సోకు' కాస్మొటిక్స్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో సంస్థ ప్రతినిధులు

గచ్చిబౌలి: చర్మ సంరక్షణ, అలంకరణ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన 'సోకు' కాస్మొటిక్స్ నగరంలో అందుబాటులోకి వచ్చింది. కొండాపూర్‌లోని శరత్‌సిటీమాల్‌లో దీన్ని ప్రారంభించారు. సోకు డైరెక్టర్ జగతిరెడ్డి మాట్లాడుతూ సోకు సౌందర్యసాధనాలు సంప్రదాయ చర్మ సంరక్షణ లక్ష్యంగా సాగుతున్నామన్నారు. మేకప్ అనేది మీరు గర్వపడేలా రూపొందించబడ్డాయని తెలిపారు.సోకు కాస్మోటిక్స్ బ్రాండ్ హెడ్ ఒరూజ్‌ఫరీనా మాట్లాడుతూ చర్మ సంరక్షణ సౌందర్య సాధనాల ప్రపంచంలో ఈ సమయం ఆవశ్యకతను గుర్తించామన్నారు. అందుకే మా బ్రాండ్ బ్యూటీ సొల్యూషన్లను ఎఫ్‌డీఏ ఆమోదించిందన్నారు.

కరోనా పరీక్షలు

గచ్చిబౌలి: కొండాపూర్ ఆస్పత్రిలో కరోనా పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆస్పత్రిలో 15 మందికి కరోనా పరీక్షలు చేయగా అందరికీ నెగెటివ్ వచ్చినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిణిరెడ్డి తెలిపారు.

6.1 కిలోల గంజాయి సీజ్.. నలుగురు అరెస్ట్



నిందితులతో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్, ఎస్ఐ వీరబాబు, సిబ్బంది

హఫీజ్‌పేట్ : రూ.3 లక్షలు విలువ చేసే 6.1 కిలోల గంజాయిని సీజ్ చేసిన సంఘటన చందానగర్, శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోటు చేసుకుంది. చందానగర్ పోలీసులు తెలిపిన ప్రకారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాప్రా మల్లాపూర్ గ్రామానికి చెందిన బాదల్‌రౌత్ (24), ముమ్మిడి విష్ణువర్ధన్‌రెడ్డి (19) ఆటో డ్రైవర్లు. సీలేరు, భద్రాచలంకు చెందిన విశ్వ 4.1 కేజీల గంజాయిని భద్రాచలం నుంచి తెచ్చి ఘట్‌కేసర్ వద్ద బాదల్‌రౌత్, విష్ణువర్ధన్‌రెడ్డిలకు అందించాడు. వీరిద్దరు కలిసి నల్లగండ్లలో విక్రయించడానికి బ్యాగులలో పెట్టి తీసుకువచ్చారు. గురువారం రాత్రి నల్లగండ్ల చౌరస్తాలో మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి చందానగర్ పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా బాదల్‌రౌత్, విష్ణువర్ధన్‌రెడ్డిలు పోలీసులను చూసి ఆటో దిగి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే పోలీసులు వారిని పట్టుకొని బ్యాగును తనిఖీ చేయగా 4.1 కిలోల గంజాయి దొరకడంతో చందానగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

గంజాయి మొక్క పెంచుతూ...

గోపినగర్‌లో ఉండే మారెళ్ళ ఆనంద్ (42) రాళ్ళు కొడుతూ జీవనం సాగిస్తున్నాడు. గత 4 నెలలుగా ఇంట్లో గంజాయి మొక్క పెంచుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు ఆనంద్ ఇంటిపై గురువారం రాత్రి దాడి చేసి గంజాయి మొక్కను స్వాధీనం చేసుకొని అతన్ని చందానగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. గంజాయి మొక్క అర కిలో ఉంటుందని దాని విలువ రూ.25వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసుల దాడుల్లో..

చందానగర్ పాపిరెడ్డి కాలనీలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడకు చెందిన బి.అర్జున్‌రెడ్డి(25) ఐటీ ఉద్యోగి. నెల రోజుల క్రితం ఏపీ రాష్ట్రం అరకు వెళ్ళి గంజాయి తెచ్చి పాపిరెడ్డి కాలనీలో విక్రయిస్తున్నాడు. ఈ విషయంను గమనించిన స్థానికులు శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించడంతో గురువారం రాత్రి అర్జున్ విక్రయిస్తున్న ప్రదేశానికి వెళ్ళి అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అతని ఇంట్లో సోదా చేయగా 1.50 కిలోల గంజాయి దొరికింది. దాని విలువ రూ.75 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ హాల్‌ల పరిశీలన

పటాన్‌చెరు టౌన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం (7) సెగ్మెంట్లకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాటుపై శుక్రవారం పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం యూనివర్సిటీని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులతో కలిసి సందర్శించారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ మహిపాల్‌రెడ్డి, పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: బైకును వెనుక నుండి టిప్పర్ ఢీ కొట్టిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలై మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మల్లయ్య కథనం ప్రకారం...బిహార్‌కు చెందిన జితేందర్ సాని(26), ఉపేందర్ సాని సోదరులు. ఇద్దరు బతుకుదెరువు కోసం ఆరు సంవత్సరాల క్రితం అమీన్‌పూర్ పరిధిలోని లింగమయ్య కాలనీకి వచ్చి ఓబులేష్ అనే వ్యక్తి వద్ద సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.ఈ క్రమంలో శుక్రవారం ఉదయం జితేందర్ సాని బైక్‌పై గోశాల నుండి మల్లికార్జుననగర్ వైపు వెళ్తుండగా వెనుక నుండి వచ్చిన టిప్పర్ బైక్‌ని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన జితేందర్ సానిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కిష్టారెడ్డిపేటలో చైన్‌స్నాచింగ్

● వారం వ్యవధిలో రెండో ఘటన

పటాన్‌చెరు టౌన్: మనుమడిని స్కూల్ కి తీసుకువెళ్తున్న మహిళ మెడలో నుండి గొలుసు లాక్కెళ్లిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ సదా నాగరాజ్ కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట్ వెంకటరమణ కాలనీ చెందిన సావిత్రి అనే మహిళ తన మనుమడిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలకు శుక్రవారం ఉదయం తీసుకు వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు సావిత్రి మెడలో నుండి బంగారు గొలుసుని లాక్కుని పరారయ్యారు. బాధితురాలి కుమారుడు నవీన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మిల్లెట్ స్నాక్స్

లక్డీకాపూల్ : ఆహారం ఆరోగ్యం ఇవ్వాలి.. పోషకాహారంగా, శక్తివంతంగా ఉండాలి. ఇది అందరి మదిలోని మాట. అందుకే ఆధునికతలోనూ ఆరోగ్యాన్ని అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ట్రూ గుడ్' నిశ్శబ్ద విప్లవంలా ఆవిష్కృతమవుతుంది. సహజమైన అలెర్జీ రహిత లక్షణాలు కలిగిన మిల్లెట్ స్నాక్స్‌కు ప్రజాదరణ పెరుగుతుంది. ప్రజలకు పోషకాహారం లక్ష్యంగా రోజుకు మూడు మిలియన్లకు పైగా పోషకాహార మిల్లెట్ చిక్కీ బార్‌లు విక్రయాలు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా కిరాణా స్టోర్ల నుంచి ఆధునిక వ్యాపార సంస్థల వరకు 30 వేలకు పైగా అవుట్‌లెట్‌లలో ఉనికిని చాటుకున్న ట్రూ గుడ్ మిల్లెట్స్‌తో రక్తహీనత, మధుమేహం, ఇతర రుగ్మతలకు అవసరమైన ప్రోటీన్లు, ఐరన్, బీటా - కెరోటిన్‌లను అందిస్తుంది. దాదాపు 25 వేల పాఠశాలలలో రోజువారీ ఆహారంలో భాగంగా అల్పాహారాన్ని అందించే క్రమంలో దాదాపు 25 వేల పాఠశాలలో ట్రూ గుడ్ స్నాక్స్‌ను అందిస్తున్నామని సంస్థ యాజమాన్యం తెలిపింది.



గ్రాండ్ గాలా కార్నివాల్

మాదాపూర్: మాదాపూర్‌లోని ఎన్‌కన్వెన్షన్‌లో గురువారం రాత్రి గ్రాండ్ గాలా కార్నివాల్‌ను ఘనంగా నిర్వహించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లైవ్ బ్యాండ్ మ్యూజిక్ యువతను ఉర్రూతలుగించింది. కార్నివాల్‌లో వింటేజ్ పాటలకు స్టెప్పులేశారు. బుల్లితెర నటులతో పాటు బిగ్‌బాస్ నటులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.